క్లుప్తంగా

ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై శిక్షణ



దుగ్గిరాల: పురుగు మందులు వాడకుండా ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా సుస్థిర అభివృద్ధి సాధించవచ్చునని రైతు సాధికారిక సంస్థ ప్రాజెక్టు డైరెక్టరు సీహెచ్ రాజకుమారి అన్నారు. దుగ్గిరాలలో గురువారం మండల కార్యాలయంలోని సమావేశ మందిరంలో తెనాలి సబ్ డివిజన్ పరిధిలోని దుగ్గిరాల, కొల్లిపర, తెనాలి మండలాల పరిధిలోని రైతుసేవా కేంద్రాలలో పని చేస్తున్న సిబ్బందికి ప్రకృతి వ్యవసాయంపై మూడు రోజుల పాటు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో మొదటి రోజు పాల్గొన్న రాజకుమారి మాట్లాడుతూ.. పర్యావరణానికి హాని కలిగించే రసాయనిక ఎరువులు, పురుగు మందులు ఉపయోగించకూడదని అన్నారు. కార్యక్రమంలో దుగ్గిరాల ఏవో ఆర్ విజయ్‌బాబు, కె.సుధీర్‌బాబు, శ్రీనివాస్ రెడ్డి, ఏపీ సీఎస్‌ఎఫ్ సిబ్బంది, రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల జీవితాలతో చెలగాటం



తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడవద్దని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు హెచ్చరించారు. గురువారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మనందపురంలో కార్మికులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని ఆయన యూనియన్ నాయకులు స్టీవెన్, ఆదినారాయణలతో కలిసి ప్రారంభించారు. కార్మికులు తమకు రావాల్సిన బకాయిల కోసం 233 రోజులుగా దీక్షలు నిర్వహిస్తున్నారని.. ప్రభుత్వం ఇప్పటికైనా చొరవ చూపి సమస్యను పరిష్కరించడానికి ముందుకు రావాలని నాయకులు అన్నారు. కార్మికులు కొండా ఏడుకొండలు, అంకమ్మ, దేరంగుల రమణమ్మ, శారద, సువర్ణకుమారి సామ్రాజ్యం, శారమ్మ, సత్యప్రకాష్, అంకయ్య, గురవయ్య, యెహోషువా, సాంబయ్య, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

27న ఉచిత మెడికల్ క్యాంప్

తాడేపల్లి రూరల్: ఉచిత మెగా మెడికల్ క్యాంప్‌ను ఈనెల 27న నిర్వహించనున్నట్లు మానవ సేవా సంస్థ వ్యవస్థాపకులు వంగర సురేష్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు దుగ్గిరాల మండల పరిధి పెదకొండూరు గ్రామం శ్రీ కనకపుట్లమ్మ దేవస్థానం ఫంక్షన్ హాల్‌లో ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. దుగ్గిరాల మండల పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

భక్తులకు అన్నప్రసాద వితరణ



తాడేపల్లి రూరల్: మంగళగిరి పట్టణ పరిధిలోని శ్రీ కాశీ అన్నపూర్ణేశ్వరి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ పందేటి సాంబశివరావు మాట్లాడుతూ.. ప్రతి నెలా వచ్చే అమావాస్య సందర్భంగా మంగళగిరిలోని పుణ్యక్షేత్రంలోని దేవాలయాల దర్శనార్థం వచ్చే భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమానికి సహకరిస్తున్న దాతలకు ధన్యవాదాలు తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వాకర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పుప్పాల కోటేశ్వరరావు, ట్రస్ట్ సభ్యులు నంగళం ప్రసాద్, వడ్లమూడి వెంకయ్య చౌదరి, కర్నాటి శివన్నారాయణ, బేతపూడి మధుబాబు, ఉమామహేశ్వరరావు, సుబ్బరాజు, ఆదిలక్ష్మి, జనసేన నాయకులు తిరుమలశెట్టి కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.

మోసానికి బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు



బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ సమావేశంలో మాట్లాడుతున్న వనమా



కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ కార్యకర్తలు

- ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పేరుతో హామీలు
- అధికారంలోకి వచ్చాక తూట్లు
- తాడికొండ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు

మేడికొండూరు: మోసాలకు చంద్రబాబు నాయుడు బ్రాండ్ అంబాసిడర్ అని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రాబాబు అన్నారు. మేడికొండూరు మండలం పేరేచర్ల రవీంద్ర హోటల్ సమీపంలో గురువారం జరిగిన బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చంద్రబాబు తీరు ఏరు దాటే వరకూ ఏరు మల్లన్న.. దాటాక బోడి మల్లన్న అన్నట్లు ఉందని విమర్శించారు. ఏడాది గడిచినా ఒక్క హామీనీ సక్రమంగా అమలు చేయలేదని ఆయన మండిపడ్డారు. కొత్త పింఛన్లు ఒకటి కూడా ఇవ్వలేదన్నారు. తమ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కూటమి శాఖలపై ఒత్తిడి పెంచడంతో ఈ ఏడాది నామమాత్రంగా తల్లికి వందనం పథకాన్ని అమలు చేశారన్నారు.

ఉద్యోగాలు ఎవరికిచ్చారు..

మొదటి ఏడాది సూపర్ సిక్స్ హామీలకు తిలోదకాలు వదిలారని వనమా బాల వజ్రాబాబు అన్నారు. ఉచిత గ్యాస్ డబ్బులు ఇంతవరకు సక్రమంగా ఎవరికీ అందలేదన్నారు. ఏడాదికి లక్ష ఉ ద్యోగాలు కల్పిస్తామని చెప్పిన చంద్రబాబు ఉద్యో గాలు ఎవరికిచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. ఉద్యో గాల పేరుతో నిరుద్యోగులను మోసం చేసిన కూట మి సర్కారు కనీసం నిరుద్యోగ భృతి కూడా ఇవ్వడం లేదని మండిపడ్డారు. బాబు దగాపై నిరుద్యోగులు, యువకులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారన్నారు. అన్నదాత సుఖీభవ, ఉచిత బస్సు హామీలు వాయిదాలు మీద వాయిదాలు పడుతున్నాయి తెలిపారు. పథకాల అమలును ప్రశ్నిస్తే దాడులు చేస్తూ కేసులు పెడుతూ వేధిస్తున్నారని.. ఇది మంచి పద్ధతి కాదన్నారు. ఇంటింటికి వెళ్లి బాబు మోసాలు వివరించాలని వైఎస్సార్ సీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు తాళ్లూరు వంశీకృష్ణ, మండల ఉపాధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, అబ్బాస్ బొడ్డు పెద్ద సాంబయ్య, పేరేచర్ల గ్రామ పార్టీ అధ్యక్షులు సుభాని, బొడ్డు చిన్న సాంబయ్య, ముత్యాల బాలస్వామి, కోక అర్జున్ రావు, ఉడత శ్రీనివాసరావు, కృష్ణ మోహన్, ఎంపీటీసీ సభ్యులు ఎలమంచి శ్రీను, ఎంపీటీసీ లక్ష్మీనారాయణ, అబ్దుల్లా, మైనార్టీ నాయకులు షేక్ షరీఫ్, మంగళగిరిపాడు సర్పంచ్ షేక్ రబ్బాని, ఎలమందరెడ్డి, అల్లు శ్రీనివాస్ రెడ్డి, కోటిరెడ్డి, కంకణాల పరమేశ్వరరావు, నోసిన కోటి, మిరియాల శివరామకృష్ణ, కొరివి చెన్నయ్య, పేరం సాయి, లూర్దు రాజు, శ్రీధర్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో కార్యకర్తే రారాజు

నియోజకవర్గ సమన్వయ కర్త దొంతిరెడ్డి వేమారెడ్డి

మంగళగిరి టౌన్: వైఎస్సార్‌సీపీలో సామాన్య కార్యకర్తను కూడా నాయకుడిగా తయారు చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే అని.. పార్టీలో కార్యకర్త రారాజు అని మంగళగిరి నియోజకవర్గ సమన్వయ కర్త దొంతిరెడ్డి వేమారెడ్డి అన్నారు. మంగళగిరి పట్టణ పరిధిలోని 8, 9 వార్డులలో గురువారం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వేమారెడ్డి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వ అరాచకాలు, మోసాలను ప్రజలకు వివరించాలని నాయకులకు సూచించారు. పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా కృషి చేయాలని అన్నారు. వెన్నుపోటు రాజకీయాలు, అబద్ధాలు, మోసాలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు వెన్నతో పెట్టిన విద్య అని విమర్శించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లో తీసుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో క్యూఆర్ కోడ్ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మంగళగిరి పట్టన అధ్యక్షులు ఆకురాతి రాజేష్, పట్టణ గౌరవ అధ్యక్షులు మునగాల మల్లేశ్వరరావు, గుంటూరు జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరి దామర్ల కుబేరస్వామి, జిల్లా యాక్టివిటీ కార్యదర్శి మల్లవరపు సుధారాణి, జిల్లా చేనేత విభాగ అధ్యక్షులు ఊట్లపాల శ్రీనివాసరావు, రాష్ట్ర చేనేత విభాగం కార్యదర్శి గంజి షణ్ముక్, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



క్యూఆర్ కోడ్ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వేమారెడ్డి, నాయకులు

బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి జాషువా కృషి

దుగ్గిరాల: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పద్మభూషణ్ గుర్రం జాషువా రచనలు ఎంతో దోహదం చేశాయని పలువురు కొనియాడారు. గుర్రం జాషువా స్మారక కళాపరిషత్ ఆధ్వర్యంలో నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా 54వ వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. దుగ్గిరాల పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో జాషువా కళాపరిషత్ వ్యవస్థాపక అధ్యక్షులు పేద్దేటి యోహాను, షేక్.సుభాని, జి.సుగుణరాజు, బి.యేల్లేశ్వరావు, వి.బుజ్జి బాబు, వి.చింతయ్య తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లి రూరల్: నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా వర్ధంతిని జాషువా సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం తాడేపల్లిలోని జాషువా సేవా సమితి కార్యాలయంలో నిర్వహించారు. సేవా సమితి కార్యవర్గం జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సేవా సమితి అధ్యక్షులు దర్శనపు శామ్యూల్ మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల శ్రేయస్సు కోసం జాషువా చేసిన కృషి ఎనలేనిదని అన్నారు. జాషువా సేవా సమితి కార్యదర్శి తుడిమెల్ల వెంకటయ్య, మాజీ అధ్యక్షులు గుండిమెడ జేమ్స్, సమితి కోశాధికారి చొప్పర బుల్లి బాబు, డైరెక్టర్ పెరికే బాబు, ముదిగొండ ప్రకాష్, మేకల సర్వేశ్వర రావు, బూదాల బాబు పాల్గొన్నారు.

మంగళగిరి టౌన్: నేటి యువత జాషువా ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని పలువురు వక్తలు అన్నారు. మంగళగిరి నగర పరిధిలోని ద్వారకా నగర్‌లో ఉన్న ఎస్ఎల్ఎం చైతన్య హైస్కూల్‌లో గురువారం గుర్రం జాషువా వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకులు శాంతారావు, గుర్రం జాషువా సాంస్కృతిక వేదిక అధ్యక్షులు నారాయణరావు, బాలోత్సవ నాయకులు ఐజాక్, నాయకులు జేవీ రాఘవులు, నన్నపనేని నాగేశ్వరరావు, డాక్టర్ సాయిప్రసాద్, హైస్కూల్ నిర్వాహకులు బాలకృష్ణ, చందు తదితరులు పాల్గొన్నారు.



విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పలువురు వక్తలు

జర్మనీ భాషలో ఉచిత శిక్షణ, ఉపాధి కల్పన

దుగ్గిరాల: బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం చదివిన ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగ మహిళలకు జర్మనీ భాషపై ఉచిత శిక్షణ, వసతి, ఉపాధి కల్పన ఉంటుందని దుగ్గిరాల పంచాయతీ కార్యాలయం నుంచి గురువారం ఒక ప్రకటన వెలువడింది. గుంటూరులో ఉచిత భోజనం, వసతి, శిక్షణా తరగతులు జరుగుతాయని.. 8-10 నెలల కాలపరిమితి, శిక్షణ అనంతరం మంచి వేతనంతో ఉద్యోగం పొందడానికి వీలు పడుతుందని ఆ ప్రకటనలో తెలిపారు. అర్హత ధృవ పత్రాలతో ఆగస్టు 7వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆ ప్రకటనలో సూచించారు.

ప్రకృతి వ్యవసాయంతో రైతులకు ఉపయోగాలు

ఫిరంగిపురం: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం రైతు భరోసా కేంద్రాల్లో పని చేసే వీఏఏలు, ఉద్యానవనశాఖ అసిస్టెంట్లకు ప్రకృతి వ్యవసాయంపై ఫిరంగిపురం, మేడికొండూరు మండలాల సిబ్బందికి మూడు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో వాసంతి మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులకు ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని చెప్పారు. రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు మొగ్గుచూపాలన్నారు. డీఆర్సీ ఎం.రాజవంశీ, జిల్లా నేషనల్ ఫామింగ్ అసోసియేట్(ఎన్ఎఫ్ఏ)శిక్షకులు ఉమాదేవి, సీహెచ్ వరప్రసాద్, మోడల్ మేకర్ ఇ.వెంకటేశ్వర్లు, రామకృష్ణ, తిరుపతిరావు, సహాయ వ్యవసాయ అధికారి సుబానీలు పాల్గొన్నారు.

మోటార్ల దొంగ అరెస్ట్

తెనాలిరూరల్: మోటార్లు, పంపుల హ్యాండిళ్లను చోరీ చేస్తున్న వ్యక్తిని రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ కె. ఆనంద్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని సంగం జాగర్లమూడిలోని సంగమేశ్వరస్వామి దేవస్థానం, రైతు భరోసా కేంద్రం, శ్మశాన వాటిక, ఇతర ప్రదేశాల్లోని మోటార్లు, పంపుల హ్యాండిళ్లు కొంత కాలంగా చోరీకి గురవుతున్నాయి. దీనిపై గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని సంగంజాగర్లమూడి గ్రామానికే చెందిన చిట్టిబోయిన పవన్‌గోపీ అలియాస్ బాబుగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి వివరాలు సేకరించి చోరీకి గురైన సొత్తును స్వాధీనపర్చుకున్నారు. కోర్టులో గురువారం హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్టు ఎస్ఐ తెలిపారు.

ఆదాయ పన్ను భారం కాదు బాధ్యత

ఆదాయ పన్ను అధికారి జేజీఎస్ కిషోర్‌కుమార్

తెనాలి: ఆదాయ పన్ను చెల్లించడం పన్ను చెల్లింపుదారులు భారంగా కాకుండా బాధ్యతగా భావించాలని, సకాలంలో చెల్లిస్తూ దేశప్రగతిలో భాగస్వాములు కావాలని ఆదాయ పన్నుశాఖ, తెనాలి అధికారి జేజీఎస్ కిషోర్‌కుమార్ సూచించారు. జాతీయ ఆదాయ పన్ను దినోత్సవం సందర్భంగా స్థానిక నెహ్రూనికేతన్ జూనియర్ కాలేజీలో గురువారం ఏర్పాటైన అవగాహన సదస్సుకు కాలేజీ మేనేజింగ్ డైరెక్టర్ మురళీకాంత్ వి.దాసరి అధ్యక్షత వహించారు. కిషోర్‌కుమార్ మాట్లాడుతూ భారతదేశంలో తొలిసారి ఆదాయ పన్ను విధించిన జులై 24న ఏటా ఆదాయపన్ను దినోత్సవం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. బ్రిటీష్ ప్రభుత్వం 1860 జులై 24న ఆదాయ పన్ను చట్టం తీసకొచ్చిందని, అనేక సవరణల అనంతరం భారత ప్రభుత్వం 1961లో చేసిన చట్టమే అమలులో ఉందన్నారు. ఆదాయ పన్నుతో పాటు ప్రజలు వివిధ పన్నుల రూపంలో ప్రజలు చెల్లించే డబ్బును ప్రభుత్వం దేశాభివృద్ధికి వినియోగిస్తుందని గుర్తుచేశారు. ఆదాయ పన్ను చెల్లింపునకు సంబంధించిన లఘుచిత్రాన్ని ప్రదర్శించారు. పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్‌తో అవగాహన కల్పించారు. కాలేజీ యాజమాన్యం కిషోర్‌కుమార్‌ను సత్కరించింది. ఆదాయ పన్ను కార్యాలయ ఇన్‌స్పెక్టర్లు టి.శంకరరావు, పి.శ్రీనివాసరావు, ఆఫీస్ సూపరింటెండెంట్ ఘట్టమనేని సాయిరేవతి, అధ్యాపకులు పాల్గొన్నారు.



కిషోర్‌కుమార్‌ను సత్కరించిన మురళీకాంత్

ఘనంగా చౌడేశ్వరీ అమ్మవారి జన్మదినోత్సవం

తాడేపల్లి రూరల్: దేవాంగ చేనేత కుల దేవత శ్రీశ్రీశ్రీ చౌడేశ్వరీ అమ్మవారి జన్మదినోత్సవాన్ని గురువారం అమరావతి దేవాంగుల సంక్షేమ సంఘం, రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మంగళగిరి కొప్పురావు కాలనీలోని అయిదవ లైన్‌లో గల సంఘ కోశాధికారి అల్లాక నమశివాయ ఇంటి వద్ద నుంచి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మహిళలు బోనాలతో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయంలోని శ్రీశ్రీశ్రీ చౌడేశ్వరీ దేవి అమ్మవారికి పంచామృత అభిషేకాలు, కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పద్మశాలీయ వెల్ఫేర్ కార్పొరేషన్ డెవలప్‌మెంట్ చైర్మన్ నందం అబద్దయ్య, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మెడికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, అమరావతి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఊటుకూరి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, మంగళగిరి దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్ష కార్యదర్శులు బల్ల వెంకట రమణ, అల్లక తాతారావు, తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారికి బోనాలు తీసుకువెళుతున్న భక్తులు

మహిళా రిజర్వేషన్ చట్టాన్ని సవరించాలి

మంగళగిరి టౌన్: చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌తో పాటు కేంద్ర ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం చేసిన చట్టానికి, బీసీ మహిళలకు సబ్ కోటానిస్తూ సవరణ చేసి మాత్రమే అమలు జరపాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకరరావు కేంద్రాన్ని డిమాండ్ చేశారు. మంగళగిరి నగర పరిధిలోని రాష్ట్ర కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ స్థాయిలో జన గణనలో కులగణన జరిగి.. ఆపై నియోజకవర్గాల పునర్విభజన చేసిన అనంతరమే మహిళా రిజర్వేషన్లను అమలు జరపాల్సి ఉందన్నారు. ఈనెల 28న విజయవాడలో జరిగే ఓబీసీ మహిళల రిలే నిరాహార దీక్షను జయప్రదం చేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. సమావేశంలో రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కుమ్మర క్రాంతి కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, ఉద్యోగ విభాగ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు గుంటుపల్లి ఉమామహేశ్వరరావు, ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకా వెంకటేశ్వరరావు, మహిళా అధ్యక్షురాలు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శంకరరావు

పీహెచ్‌సీ సమీపంలో నిలిచిన వర్షపు నీరు!

ఫిరంగిపురం: మండలంలోని పలు ప్రాంతాలలోని గుంతలు, పల్లం ప్రదేశాలు కొద్దిపాటి వర్షానికే తటాకాలలా దర్శనమిస్తున్నాయి. చిన్న చిన్న చినుకులకే ఆ ప్రాంతాలలో నీరు నిలిచిపోతోంది. సరైన నీటి పారుదల సౌకర్యం లేకపోవడంతో ఆ నీరు మురుగుగా మారి దుర్వాసన వస్తోందని స్థానికులు వాపోతున్నారు. ఈ గుంతలు దోమల విజృంభనకు నిలయాలుగా మారుతున్నాయని ప్రజలు చెబుతున్నారు. నుదురుపాడు పీహెచ్‌సీ సమీపంలో రోడ్డు పక్కగా ఉన్న పల్లం ప్రాంతంలో నీరు రోజుల తడబడి ఉంది. రోడ్డుపై నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా మారుతోందని ప్రజలు చెబుతున్నారు. తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని గుంతలో మురుగు నీరు చేరి దుర్వాసన వస్తోంది. ఐసీడీఎస్ కార్యాలయం, ఎస్సీ బాలుర వసతి గృహాల వద్ద కూడా ఇదే పరిస్థితి నెలకొంది. సంబంధిత శాఖ అధికారులు స్పందించి తక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



నుదురుపాడు పీహెచ్‌సీ సమీపంలో నిలిచిన నీరు

బయటపడుతున్న వేళాంగిణి రాజు మోసాలు!

- క్యాటరింగ్ పేరుతో వివాహితకు రూ.3 లక్షల టోకరా
- ఎయిమ్స్‌లో ఉద్యోగాల పేరుతో మరో ఆరుగురి బాధితుల నుంచి రూ.7.56 లక్షల వసూలు

మంగళగిరి టౌన్: ఉద్యోగాల పేరుతో పలువురి నిరుద్యోగుల వద్ద నుంచి కోట్లాది రూపాయలు దండుకున్న అంబటి వేళాంగిణి రాజు మోసాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఉద్యోగావకాశాల పేరతో గత కొన్నేళ్లుగా మోసాలకు పాల్పడుతున్న మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి యర్రబాలెంకు చెందిన రాజును ఇటీవల మంగళగిరి రూరల్ పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. న్యాయమూర్తి రిమాండ్ విధించిన విషయం విదితమే. తాజాగా రాజు మోసాలపై మంగళగిరి పట్టణ పోలీసులకు ఫిర్యాదు అందింది. సేకరించిన వివరాల మేరకు.. నగరంలోని ద్వారకా నగర్‌కు చెందిన కె.విజయలక్ష్మి, గోపి దంపతులకు పరిచయం అయిన రాజు.. పెద్ద క్యాటరింగ్ కావాలంటే తనకు రూ.3 లక్షలు నగదు ఇవ్వాలని నమ్మబలికాడు. దీంతో అదే రోజు విజయలక్ష్మి నగదును ఇచ్చారు.

ఉద్యోగాల పేరుతో..

10 రోజుల తర్వాత రాజు విజయలక్ష్మికి ఫోన్ చేసి మంగళగిరి ఎయిమ్స్ ఆసుపత్రిలో ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పగా తన తమ్ముడు సతీష్‌కుమార్ ఉద్యోగం లేక ఖాళీగా ఉన్నాడని తెలిపింది. దీంతో రాజు మరో ఆరు ఉద్యోగాలు కూడా ఉన్నాయని నమ్మబలికి పలువురి నుంచి లక్షల రూపాయలు వసూలు చేశాడు. దీంతో బాధితులు మంగళగిరి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

సంక్షేమ పథకాలపై అవగాహన కలిగి ఉండాలి

మేడికొండూరు: ప్రతి ఒక్కరూ సంక్షేమ పథకాలపై అవగాహన కలిగి ఉండాలని మేడికొండూరు తహసీల్దార్ ఎం.హరిబాబు అన్నారు. భారత ప్రభుత్వం, కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వశాఖ, మేరా యువ భారత్ ఆధ్వర్యంలో మేడికొండూరులో గురువారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఆయన వివరించారు. మేరా యువ భారత్ జిల్లా యువ అధికారి కిరణ్మయి దేవిరెడ్డి మాట్లాడుతూ.. సరైన అవగాహన ఉన్న లబ్ధిదారులు మాత్రమే వాటిని వినియోగించుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో మండల వెలుగు ఏపీఎం గొల్లపూడి విజయభారతి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేడికొండూరు బ్రాంచ్ మేనేజర్ కె.నాగరాజు, కమ్యూనిటీ కోఆర్డినేటర్ పి.పూర్ణయ్య, కె.లక్ష్మి, పేస్ సొసైటీ సెక్రటరీ పారుపల్లి రమేష్ పాల్గొని ప్రసంగించారు. అనంతరం వివిధ పథకాల వివరాలతో గోడ పత్రికలు ప్రదర్శించారు. మండలంలోని యానిమేటర్లు దుర్గా, యడ్ల శిరీష, ఉడతా భాగ్యలక్ష్మి, నోసిన ప్రసన్న, దొప్పలపూడి జ్యోతి, ఉదయలక్ష్మి, సంకు శ్రీదేవి, మహమ్మదా సుధా, సునీత, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న తాహసీల్దార్, ఏపీఎం, సీసీలు, యానిమేటర్లు

విద్యార్థులకు పుస్తకాలు, మొక్కలు పంపిణీ

తెనాలిఅర్బన్: విద్యార్థులు విద్యలో రాణించాలని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుగ్రహీత వేజళ్ల ఉమామహేశ్వర్ పేర్కొన్నారు. విశ్రాంత వ్యవసాయ విస్తరణాధికారి వేజళ్ళ వెంకట సుబ్బారావు 11వ వర్ధంతిని పురస్కరించుకుని బీసీ కాలనీలోని వేజళ్ళ వెంకట సుబ్బారావు స్పెషల్ పురపాలక పాఠశాలలోని విద్యార్థులకు వ్రాత, డ్రాయింగ్ పుస్తకాలు, కలర్ క్రేయన్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుబ్బారావు స్మారక విద్యాట్రస్ట్ ఆధ్వర్యంలో పాఠశాలను 2017లో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆయన జ్ఞాపకార్థం విద్యార్థులకు గ్రంథాలయ పుస్తకాలు, గుడ్డ సంచులు, మొక్కలు, దుస్తులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఓంకారప్రసాద్, ప్రధానోపాధ్యాయులు నాగమణి, ఉపాధ్యాయులు పద్మజ, నాగేంద్రబాబు, మమత, ట్రస్ట్ సభ్యులు శ్రీదేవి, బి.శివరామకృష్ణ, వేజళ్ళ ఝాన్సీలక్ష్మీ, బి.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు, పుస్తకాలు అందుకున్న విద్యార్థులతో ఉమామహేశ్వర్

సీఆర్డీయే జాబ్ మేళా విజయవంతం

తాడికొండ: ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ ఏపీ సీఆర్డీయే ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి.. శిక్షణ శాఖ సౌజన్యంతో తుళ్లూరులోని సీఆర్డీయే స్కిల్ హబ్ ప్రాంగణంలో గురువారం జాబ్ మేళా నిర్వహించారు. ఈ మేళాలో పలు సంస్థలు పాల్గొన్నాయి. 400కి పైగా టెక్నికల్ ఉద్యోగాలను భర్తీ చేసేందుకు నిర్వహించిన ఈ జాబ్ మేళాకు 318 మంది అభ్యర్థులు హాజరు కాగా.. 102 మందికి ఉద్యోగాలు లభించాయని అధికారులు తెలిపారు. వీరిలో 30 మంది అభ్యర్థులకు ఆయా కంపెనీల హెచ్ఆర్ విభాగ ప్రతినిధులు ఆఫర్ లెటర్లను అందజేశారు. ఏపీఎస్ఎస్‌డీసీ ప్లేస్‌మెంట్ అధికారి అరుణ కుమారి, సీఆర్డీయే డీసీడీవో బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు. సీఆర్డీయే సీనియర్ లైవ్‌లీహుడ్ ఆఫీసర్ శంకర్, జూనియర్ లైవ్‌లీహుడ్ స్పెషలిస్టులు క్రాంతికుమార్, నరసింహం, వెంకటేశ్వర్లు పాల్గొని జాబ్ మేళాను సమర్థంగా నిర్వహించారు.



ఎంపికైన అభ్యర్థులతో సీఆర్డీయే, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులు

కథల పుస్తకాలు వితరణ

దుగ్గిరాల: విద్యార్థులు పాఠ్య పుస్తకాలే కాకుండా.. ఇతర ఊహాత్మక కథలు, ప్రముఖుల జీవిత చరిత్రలు చదవడం ద్వారా మేథస్సు పెరుగుతోందని హెచ్.ఎం ఎస్.శోభాదేవి అన్నారు. గురువారం దుగ్గిరాల బాలికల ఉన్నత పాఠశాలకి బ్రెడ్ సొసైటీ వారు అందించిన 40 రకాల తెలుగు, ఇంగ్లిష్ భాషలకు సంబంధించిన కథల పుస్తకాలను విద్యార్థులకు ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బ్రెడ్ సొసైటీకి ఆమె ధన్యవాదాలు తెలిపారు.